వంక పోరంబోకులో నిర్మాణాలను కూల్చేస్తున్న రెవెన్యూ అధికారులు



అక్రమ నిర్మాణాలు కూల్చివేత

● గుర్రంకొండలో ఉద్రిక్త వాతావరణం

గుర్రంకొండ, జనవరి 9: గుర్రంకొండ పట్టణంలోని జీవన్‌తోపు రోడ్డు మార్గంలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చేశారు. ఈ మార్గం చాలా వరకు వంక పొరంబోకు స్థలం కావడంతో నిర్మాణాలను తొలగించినట్లు తహసీల్దార్ ఖాజాబీ తెలిపారు. ఆమె వివరాల మేరకు... గుర్రంకొండ పట్టణంలోని సర్వే నెంబరు 127లో 3.56 ఎకరాల్లో వంక పొరంబోకు స్థలం ఉంది. ఈ మార్గం గుండా జీవన్‌తోపు వరకు రోడ్డు ఉంది. ఈ మార్గంలోని వంక స్థలాన్ని చాలామంది ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన ప్రజలు లోకాయుక్తను ఆశ్రయించడంతో ఈనెల 31వ తేదీలోగా అక్రమ నిర్మాణాలను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో ఆర్డీవో ఆదేశాల మేరకు ఆక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నట్లు తెలిపారు. వంక పొరంబోకు స్థలాన్ని 14 మంది ఆక్రమించుకున్నట్లు గుర్తించామన్నారు. ఆక్రమణదారులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు అందజేశామన్నారు. 9 మంది ఆక్రమణదారులు హైకోర్టులో స్టే ఆర్డర్‌ను తెచ్చుకొన్నారని, మిగిలిన 5 మందికి చెందిన ఆక్రమ నిర్మాణాలను మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించినట్లు తెలిపారు. గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా అక్రమ నిర్మాణాలకు సంబంధించి హైకోర్టులో స్టే ఉన్న నిర్మాణాలపై ఈనెల 29న లోకాయుక్త కోర్టులో వాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. లోకాయుక్త ఆదేశాల మేరకు స్టే ఉన్న వాటిపై తదుపరి చర్యలు ఉంటాయని తహసీల్దార్ ఖాజాబీ స్పష్టం చేశారు.

సమరానికి సై

● కత్తులు దూస్తున్న పందెంకోళ్లు

● ఇతర రాష్ట్రాల నుంచి జాతి కోళ్ల కొనుగోలు

● ఒక కోడిపుంజు విలువ రూ.5 వేల నుంచి రూ.లక్ష

● రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు పందేల జోరు

● రైల్వేకోడూరు నియోజకవర్గంలో ముమ్మరంగా కోడిపందేలు





రైల్వేకోడూరు, జనవరి 9: సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో పందెం కోళ్ల కత్తులు దూసి పందేనికి సై అంటున్నాయి. రైల్వేకోడూరు చుట్టుపక్కల గుట్టు చప్పుడు కాకుండా పందెంరాయుళ్ల కోడిపందేలు జరిపిస్తున్నట్లు తెలుస్తోంది. రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు పందేలు కాస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పందెంరాయుళ్లు ఇతర రాష్ట్రాల నుంచి మంచి జాతి కోళ్లను నెల ముందే కొనుగోలు చేసి తీసుకుని వచ్చారు. ఒక్కో పందెం పుంజు రూ.5 వేలు, రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష విలువ చేసేవి తీసుకుని వచ్చారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో ముమ్మరంగా పందేలు సాగుతున్నాయి. పందేలు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టి ఆడుతున్నట్లు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలోని తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, రాజమండ్రి, నెల్లూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో సంక్రాంతికి ముందే కోడిపందేలు భారీ ఎత్తున నిర్వహిస్తారు. వాటిలాగా కాకున్నా ఇక్కడ ఓ మోస్తరుగా పందేలు సాగుతున్నాయి. నెల ముందుగానే సేలం, మదనపల్లె, పీలేరు, తిరుపతి, ఒంగోలు, విజయవాడ, తూర్పు, పశ్చిమ గోదావరి తదితర ప్రాంతాల నుంచి జాతి పందెం కోళ్లను తీసుకుని వస్తారు. వాటిని కొనుగోలు చేసే ముందుగా కోడి పందెంలో ఎలా తలపడుతుంది, ఈకలు ఎలా ఉన్నాయి, కోడికి భయం ఉందా, దెబ్బలు ఏమైనా ఉన్నాయా, కత్తి కడితే ఎలా పరుగు ఉంటుంది, ఎలా ఎగురుతుంది, కోడి కలర్ తదితర వాటిని పందెంరాయుళ్లు ఆలోచించి కోడికి ధర నిర్ణయించి తీసుకుంటారు. తీసుకున్న తర్వాత జాతి కోడికి భయం పోవడానికి ఈత కొట్టిస్తారు. ప్రతిరోజూ రెండు పూటలా బాదం, జీడిపప్పు, జొన్నలు, రాగులు, సజ్జలు తదితర వాటిని పెట్టి మేపుతారు. కోడి గట్టితనంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. కోళ్ల పందెంలోకి దిగినప్పుడు కత్తి గుచ్చుకున్నా ఏమీ కాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉంటుంది కాబట్టి కోళ్లకు తగినంత వెచ్చదనం ఉండేలా చూస్తారు. జాతి కోళ్లకు ముందుగా రోగాలు రాకుండా పశువైద్య శాలల్లో మంచి మందులు తీసుకుని వాడతారు. అవసరమైన ఇంజక్షన్లు వేయిస్తారు. జాతి కోళ్లలో డేగ, ఎర్రడేగ, కాకి, కాకి నెమలి, గాజు, తెల్ల, పొడ తదితర రకాలు ఉంటాయి. కోళ్లకు కత్తులు సపరేటుగా లభిస్తాయి. వాటిని భద్రపరుచుకుని పందానికి వెళ్లే ముందు బాగా పదును ఎక్కిస్తారు. కోడి కాలుకు కత్తి కట్టే వాళ్లు, కోళ్లను పందెంలోకి వదిలి పెట్టే వారు ప్రత్యేకంగా ఉంటారు. పందెం జరిగే ప్రాంతం, ఎప్పుడు, ఎక్కడ, ఎలా అనే విధంగా ప్రణాళిక తయారు చేసుకుంటారు. సెల్‌ఫోన్లలో సమాచారం అందించుకుంటారు. కాకి, కాకి నెమలి తదితర కోళ్లను పందెంలో దింపాలంటే సాయంత్రం వేళల్లో మాత్రమే పందేలు ఆడతారు. ఎందుకంటే వాటికి సాయంత్రం ప్రత్యేకత ఉంది. మిగిలిన సమయాల్లో అవి పందెంలో సక్రమంగా పోటీ పడలేవు. పొద్దుపోయే ముందు అయితే ఇంకా బాగా అవి పోరాడతాయని కోడి పందెంరాయుళ్లు చెబుతున్నారు. జాతి పందెం కోళ్లకు ప్రతిరోజూ ఖర్చు రూ.1000 అవుతుంది. కోడి పందేలు ముమ్మరంగా సాగుతున్నా సంబంధింత శాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కోడి పందేలకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడం కొసమెరుపు.

నిఘా పెట్టాము

- టి.మధుసూదన్‌రెడ్డి, సీఐ, రైల్వేకోడూరు

కోడి పందేలపై ప్రత్యేక నిఘా పెట్టాము. ఎక్కడ కోడి పందేలు జరుగుతున్నాయని ప్రజలు సమాచారం అందిస్తే నిఘా ఉంచి పట్టుకుంటాము. కోడి పందెం ఆడే ప్రాంతాలను గుర్తిస్తున్నాము. కోడి పందేలను అరికట్టడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాము.




ఎర్రగాజు జాతి కోడి పందెం పుంజు



కాకి డేగ పుంజు



తెల్లనెమలి పుంజు



పొడ జాతి కోడి పుంజు

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల భిక్షాటన

● తమను రోడ్డుపై పడేశారు... ● ఆందోళనలో మున్సిపల్ కార్మికులు



రోడ్డుపై భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మదనపల్లె, జనవరి 9: మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు, రోజువారీ వేతన కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మంగళవారం శిబిరంలోకి చేరుకున్న కార్మికులు మొదట డప్పులు వాయించగా, తర్వాత జక్కీ, కోలాటం ఆడుతూ నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి బెంగళూరు బస్టాండు వరకూ ర్యాలీగా వెళ్తూ భిక్షాటన చేశారు. తిరిగి అక్కడి నుంచి ఇదే రీతిలో రోడ్డుపై, దుకాణదారుల నుంచి డబ్బులు అడుక్కుంటూ సమ్మె చేస్తున్న ప్రాంతానికి చేరుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనాలు చాలడం లేదని, తమ డిమాండ్లు, న్యాయపరమైన కోర్కెలు తీర్చేందుకు వైసీపీ ప్రభుత్వం ముందుకు రాక, తమను రోడ్లపై వెళ్లి భిక్షాటన చేసే స్థితికి తెచ్చిందని విమర్శించారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. రోజులు గడిచేకొద్దీ ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఇందులో యూనియన్ నాయకులు ఎస్.మస్తాన్, సురేశ్‌కుమార్, ఎస్.ముబారక్, నాగరాజ, దేవా, తిరుమల, పృథ్విరాజ్, గోపాల్, ఇంద్రాణి, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో మంగళవారం జరిగిన కేంద్ర ఎన్నికల సంఘం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ పీఎస్ గిరీషా, ఎస్పీ కృష్ణారావు

పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై కఠిన చర్యలు

● అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్

రాయచోటి టౌన్, జనవరి 9: జిల్లావ్యాప్తంగా పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీసు అధికారులు, రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్యశాఖాధికారులు, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులతో సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశంలో ధూమపానం చేసే వారిపై, విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్ డాక్టర్ విజయానంద్‌రెడ్డి మాట్లాడుతూ 90 శాతం నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు నేరుగా పొగాకు ఉత్పత్తుల వాడకం వల్లనే వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 20 శాతం పెద్దలు (15 సంవత్సరాలు పైబడిన వాళ్లు) ఏదో ఒక రూపంలో పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నారన్నారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 నుంచి 15 సంవత్సరాల వయస్సు వారిలో 33.6 శాతం మంది పొగాకు వినియోగదారులుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తుల ప్రాబల్యాన్ని తగ్గించడానికి ఆరోగ్య, విద్యాశాఖలు అన్ని జిల్లాల్లో పొగాకు రహిత విద్యా సంస్థ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీసు అధికారులు, రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్యశాఖ అధికారులు, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రాజ్‌కమల్, సమావేశానికి హాజరైన జిల్లాలోని పోలీసు అధికారులు

స్తంభిస్తున్న విద్యా వ్యవస్థ

● సమ్మెలో ఎస్ఎస్ఏ సిబ్బంది
● ప్రభుత్వానికి చేరని డేటా వివరాలు
● మధ్యాహ్న భోజన బిల్లులు అందేనా..?
● సమ్మెలో ఉన్న వారికి షోకాజ్ నోటీసులు జారీ



రాయచోటి కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా ధర్నా చేస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బంది (ఫైల్)

మదనపల్లె టౌన్, జనవరి 9: ప్రభుత్వానికి, విద్యావ్యవస్థకు అనుసంధానంగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది నిరవధిక సమ్మెతో విద్యావ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా మారుతోంది. జిల్లాలో 800 మంది సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో గత నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు ప్రభుత్వానికి నివేదించడం, ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు వచ్చే ఉత్తర్వులను వారికి అందజేయడం తదితర అంశాలు కుంటుపడ్డాయి. దీంతో విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వచ్చే ఉత్తర్వులు అమలు చేయడం, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ, నిర్వహణ అంశాలు మండలాల్లో పనిచేస్తున్న ఇద్దరేసి ఎంఈవోలకు తలభారం అవుతోంది. సమయానికి నివేదికలు రూపొందించి, ప్రభుత్వానికి అందించలేక ఎంఈవోలు సతమతమవుతున్నారు. ప్రతి నెలా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా ఎస్ఎస్ఏ సిబ్బందే నిర్వహించాల్సి ఉంది. వీరు సమ్మెలో ఉండటంతో ఈనెల మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు చెల్లించే అవకాశం లేదని తెలుస్తోంది. కేవలం 20 రోజుల్లోనే విద్యావ్యవస్థ ఇలా మారుతుంటే సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తే మొత్తం విద్యావ్యవస్థ నిద్రాన్న స్థితిలోకి వెళ్లక మారదన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

నిలిచిపోయిన సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది విధులు

విద్యావ్యవస్థలో పదేళ్లుగా సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఐఆర్‌టీలు ప్రతి మండలంలో ఎమ్మార్సీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. ప్రతి ఏటా వీరిని రెన్యువల్ పద్ధతిలో తిరిగి కాంట్రాక్టు సిబ్బందిగా ప్రభుత్వం తీసుకోవడం పరిపాటిగా మారింది. గతంలో సీఆర్‌పీలుగా పరిగణిస్తున్న వారిని ఇప్పుడు సీఆర్ఎంపీ (క్లస్టర్ రీసోర్సు మొబైల్ టీచర్)గా పిలుస్తున్నారు. వీరు ముఖ్యంగా సింగిల్ టీచర్ ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవుపై వెళితే ఆ పాఠశాలకు వెళ్లి తరగతులు నిర్వహించాలి. దీంతో పాటు ఆయా క్లస్టర్ పరిధిలో అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం వివరాలు సేకరించి అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదికలు పంపాలి. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు వివరాలు నమోదు చేయాలి. దీంతో పాటు నాడు-నేడు పనుల పురోగతి గురించి ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలి. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి అక్కడ తీసుకునే నిర్ణయాలను ఎంఈవోల ద్వారా విద్యాశాఖకు అందజేయాలి. లైబ్రరీలకు వచ్చే పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలి. ఇదిలా ఉండగా విద్యాసంవత్సరం ప్రారంభంలో సీఆర్ఎంపీలదే కీలక పాత్ర అన్నది జగమెరిగిన సత్యం. ఇదిలా ఉండగా సీఆర్ఎంపీలను, ఎంఈవో వ్యవస్థకు అనుసంధానంగా పనిచేస్తున్న 30 మంది ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు కూడా సమ్మెలోకి వెళ్లిపోయారు. దీంతో కంప్యూటర్ పనులన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. చైల్డ్ ఇన్ఫో, విద్యార్థుల ఆధార్ సీడింగ్, జగనన్న గోరుముద్ద, ఈ-మెయిల్స్ తదితర పనులు నిలిచిపోయాయి.



సమగ్ర శిక్షా అభియాన్ సమ్మెతో మదనపల్లె ఎమ్మార్సీ కార్యాలయంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది సమ్మె

ఐదేళ్లుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారు. వారి డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గత నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లిపోయారు. దీంతో జిల్లాలోని అన్ని మండలాల్లో ఎమ్మార్సీ కార్యాలయాలు మూతపడ్డాయి. కంప్యూటర్లు మూగపోయాయి. సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని, వారి విధులను క్రమబద్ధీకరించాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చేలా పీఆర్‌సీలో 23 శాతం తమకు ఇవ్వాలని, ప్రతి నెలా వేతనం అందించాలన్నది వీరి ప్రధాన డిమాండ్. ఇకపోతే మహిళా సిబ్బందికి చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు చేయాలని, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు జాబ్ చార్ట్ విడుదల చేయాలని, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బందికి ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై గత నెల ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో డిసెంబరు 20వ తేదీ నుంచి సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది నిరవధిక సమ్మెలోకి దిగారు. ఎమ్మార్సీ కార్యాలయాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద ధర్నా, నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకుంటే సమ్మెను మరింత ఉధృతం చేసే దిశగా ఎస్ఎస్ఏ సిబ్బంది భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. కాగా ఎస్ఎస్ఏ సిబ్బంది సమ్మెలో ఉండటంతో ప్రభుత్వం వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విధులకు హాజరు కాకుండా ఉన్న మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ప్రభుత్వం వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

సీఎం జగన్‌కు రంగులు.. బొమ్మల పిచ్చి..

● టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం..
● అంగన్వాడీలకు నల్లారి కిశోర్ హామీ
● జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు



రాయచోటిలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

రాయచోటి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిల్లో అంగన్వాడీల ఆందోళనలు కొనసాగుతున్నాయి. వాల్మీకిపురంలో అంగన్వాడీలు చేస్తున్న ఆందోళనలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మంగళవారం సంఘీభావం ప్రకటించి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు మొదలుకుని నిరుపేద ప్రజల వరకు సమస్యలతో అల్లాడుతూ రోడ్డున పడుతుంటే పరిష్కరించాల్సింది పోయి మన సీఎం జగన్‌కు రంగులు, బొమ్మల పిచ్చి పట్టుకుందని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలు తనకు పూర్తిగా తెలుసని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా దాడులు, దౌర్జన్యాలతో అరాచక పరిపాలన సాగిస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అంగన్వాడీలకు ఏనాడూ అన్యాయం జరగలేదని ఈ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక దరిద్రం పట్టుకుందన్నారు. ఈనెల 24న పీలేరులో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా అంగన్వాడీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తానని, అంగన్వాడీ మహిళలను ఆయనతో మాట్లాడించి రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తక్షణం అంగన్వాడీల సమస్యలు తప్పక పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాయచోటి కలెక్టరేట్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా అంగన్వాడీ కార్మికులు, సహాయకులు ఒంటికాళ్ల మీద నిలబడి తమ నిరసనను తెలిపారు. మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండులో అంగన్వాడీలు రాస్తారోకో చేశారు. ఎస్మా చట్టాన్ని ఎత్తివేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైల్వేకోడూరులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేశారు. వాల్మీకిపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల దీక్షలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మద్దతు తెలిపారు. బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో రిలేదీక్షలు కొనసాగించారు. రాజంపేటలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.





వాల్మీకిపురంలో అంగన్వాడీల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రైల్వేకోడూరులో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు

పుట్టగొడుగుల పెంపకం లాభదాయక వనరు

● తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ● వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 9: లాభదాయక వనరు అయిన పుట్టగొడుగుల పెంపకంతో భవిష్యత్తు పారిశ్రామవేత్తలుగా ఎదిగేందుకు విస్తృత అవకాశాలున్నాయని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. మంగళవారం వైవీయూ బయోటెక్నాలజీ శాఖ మిల్కీ మష్రూమ్స్ సాగు అనే అంశంపై ఒక రోజు సెమినర్‌ను కన్వీనరు ప్రొఫెసరు చంద్రమతి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ దేశంలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పంట సాగు కోసం చేసిన సొమ్ము రావడమే గగనం అయిపోతున్న తరుణంలో తక్కువ సమయం, పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు పుట్టగొడుగుల పెంపకం సరైనదని వివరించారు. ఈ వర్క్‌షాపును రైతులు, విద్యార్థులు, గ్రామీణులు సద్వినియోగం చేసుకుని చిన్నతరహా పరిశ్రమలు స్థాపించాలని కోరారు.
ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ 1970కి ముందు కోళ్ల పరిశ్రమ లేదని ఆ తరువాత సుందరనాయుడు అనే వ్యక్తి ప్రారంభించారన్నారు. ఇది ఇప్పుడు పెద్ద పరిశ్రమగా నెలకొల్పబడిందన్నారు. ఎస్‌బీఐ మేనేజరు సుధాకర్ మాట్లాడుతూ ఆసక్తి గల యువతకు రుణాలు ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి ఎస్‌బీఐ ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. అగ్రి కమర్షియల్ బ్యాంకు అనే ప్రత్యేక విభాగం ఉందన్నారు.
ప్రొఫెసరు చంద్రమతి శంకర్ బయోటెక్నాలజీ గురించి వివరించారు. సహాయ కన్వీనరు చంద్రశేఖర్, అధ్యాపకులు విమల, డాక్టర్ విఘ్నేశ్వర్‌రెడ్డి, కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్. శ్రీనివాసరావు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు అడిగితే నిర్బంధించడం న్యాయమా?

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9: ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.18వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ప్రజాస్వామిక పద్ధతిలో పోరాటం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులను నిర్బంధించడం న్యాయమా అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా విమర్శించారు. కడప నగరం కలెక్టరేట్ ఎదుట ఆర్థిక బకాయిలు చెల్లించాలని మంగళవారం సాయంత్రం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులను అప్రజాస్వామికంగా నిర్బంధించినందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని విమర్శించరు. తమకు ఇవ్వాల్సిన బకాయిలు ప్రభుత్వ బడ్జెట్ నుంచి చెల్లించాల్సిన డబ్బు కాదని, తమ జీతాల నుంచి దాచుకున్న డబ్బులు చెల్లించాలని కోరారు. బకాయిలన్నీ సెప్టెంబరు 23లోపు చెల్లిస్తామని ఆగస్టులో జరిగిన జాయింట్ శాప్ కౌన్సిల్ సమావేశంలో మంత్రులు, అధికారులు చెప్పినా ఇంతవరకు ఒక్క పైసా కూడా జమ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తుందో చెప్పాలన్నారు. ఎవరికీ లేని 144 సెక్షన్, 30 యాక్టు ఉపాధ్యాయులకేనా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరిపి వెంటనే ఉపాధ్యాయ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, రూత్ ఆరోగ్యమేరీ, ప్రభాకర్, దేవదత్తం, సత్తార్ ఫైజి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో ధనలక్ష్మి

రాయచోటిటౌన్, జనవరి 9: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తయారు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో అధికారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొదటిరోజు రాయచోటి పట్టణ పరిధిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకునే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే కాకుండా స్థానిక ప్రభుత్వాలైన గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌లకు కూడా ఉందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడమే ప్రధాన లక్ష్యంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. అనంతరం సీనియర్ ఫాకల్టీ మమత జీపీడీపీ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. డీఆర్‌డీఏ, ఎస్ఈఆర్‌డబ్ల్యుఎస్, డీడీసోషల్ వెల్ఫేర్, డీటీవో, బీసీ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ



ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కేఎస్ఆర్ఎం కమిటీ, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని) తదితరులు

సికెదిన్నె, జనవరి 9: ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న, 2024లో ఉత్తీర్ణులైన సివిల్, మెకానికల్, ఈఈఈ చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభ చాటి మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హైదరాబాదు వారు శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఎంపికయ్యారని తెలిపారు.
ఇందులో 42 మంది సివిల్, 20 మంది మెకానికల్, ముగ్గురు ఈఈఈ విద్యార్థులు మొత్తం 65 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైనవారికి ట్రైనింగ్ కాలంలో సంవత్సరానికి రూ.2.3 లక్షలు, ట్రైనింగ్ పూర్తయి బీటెక్ సర్టిఫికెట్లతో వచ్చినవారికి రూ.5లక్షలు వేతనం ఉంటుందన్నారు. ట్రైనింగ్ పీరియడ్‌లో ఉచిత భోజనం, రవాణా సదుపాయాలు ఉంటాయన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ కందుల చంద్రమోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

13న జూనియర్స్ బాల, బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

కడప (స్పోర్ట్స్) జనవరి 9: నగర డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 13వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు జూనియర్స్ బాల, బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక ప్రక్రియ జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఆర్.వెంకటసుబ్బయ్య, వర్కింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే బాల, బాలికలు 2024 ఫిబ్రవరి 4వ తేదీ నాటికి 20 సంవత్సరాల లోపు వుండాలన్నారు. బరువు అబ్బాయిలు 70 కేజీల లోపు, అమ్మాయిలు 65 కేజీల లోపు వుండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.
ఎంపికైన వారు ఈనెల 20 నుంచి 23 వరకు నంద్యాల పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ బాల,బాలికల కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి వుంటుందన్నారు. ఇతర వివరాలకు 9949304160 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మరో రైల్వే ప్రయాణికుడికి గాయాలు



గాయపడ్డ వ్యక్తి, చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జనవరి 9: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రెండు నెలల క్రితం ప్రహరీగోడ ఎక్కి రైల్వేస్టేషన్‌లోకి వస్తూ ఓ ప్రయాణికుడు డ్రైనేజి గుంతలో పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన మరువక ముందే మంగళవారం రాత్రి మరో ప్రయాణికుడు ప్రహరీ ఎక్కి దిగుతూ కిందపడిన సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు ఎర్రన్న గొట్టాలకు చెందిన నాగయ్య దైవదర్శనం కోసం వెళుతూ రైలెక్కేందుకు వచ్చాడు. ప్లాట్‌ఫారంకు వెళ్లేందుకు ఒకటిన్నర కిలోమీటర్ దూరం తిరిగిరా లేక... ప్రొద్దుటూరు బస్టాప్ వద్ద నున్న ప్రహరీని ఎక్కిదిగే ప్రయత్నం చేశాడు. అక్కడ మెట్లు లేకపోవడం.. ప్రహరీకి పేర్చిన రాళ్లు తొసగడంతో కింద పడ్డారు. దీంతో అతని నడుము, కాలికి గాయాలయ్యాయి. కదల్లేని స్థితిలో ఉన్న అతను తన బంధువులకు ఫోన్ చేయడంతో వారు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ తరచూ రైల్వేప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నా రైల్వే యాజమాన్యం పట్టించుకోకపోవడం పట్ల వారు మండిపడుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ వాహనంతో విజిలెన్స్ అధికారులు

వేంపల్లె, జనవరి 9: వేంపల్లెలో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ రెడ్డప్ప, అసిస్టెంటట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు, ఆర్ఐ లోకేష్, హెడ్ కానిస్టేబుల్ జనార్దన్‌రావు, హరినాథరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనంతో పాటు 36 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు.


ఉద్యాన పంటలపై ఆసక్తి

● గతంలో వర్షాధార పంటలు సాగు
● ప్రస్తుతం బోరుబావులను నమ్ముకుంటున్న రైతులు ● టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై డ్రిప్, స్పింకర్లు
● ఈ ప్రభుత్వంలో వ్యవసాయం దండగే.. ● ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూపు

ఒకప్పుడు ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. గతంలో పల్లె ప్రజలందరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కానీ రాను రానూ కాలం మారింది. వ్యవసాయ విధానం, ప్రజల జీవన విధానంలోనూ మార్పు వచ్చింది. గతంలో వర్షాధార పంటలైన వరి, వేరుశనగ, కంది, ఉలవ, అలసంద, రాగి, సజ్జ వంటి పంటలను సాగు చేసేవారు. నేడు వర్షాధారంపై ఆధారపడకుండా రైతులు బోరుబావులను నమ్ముకుంటున్నారు. బొప్పాయి, అరటి, జామ, నిమ్మ, మామిడి, సపోట, డ్రాగన్ ఫ్రూట్స్, కర్జూరం వంటి పంటలతో పాటు కూరగాయ పంటలైన టమోటా, వంకాయ, బెండ, మిరప, అనప వంటి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో సబ్సిడీపై పరికరాలు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయం చేయడం లేదని పలువురు అంటున్నారు.



పేరంపల్లెలో సాగులో ఉన్న బొప్పాయి



కొర్లకుంటలో సాగు చేసిన కర్జూర పంట

గాలివీడు, జనవరి 9: రాయచోటి డివిజన్ పరిధిలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం, సంబేపల్లె, వీరబల్లి, సుండుపల్లె, రాయచోటి రూరల్ మండలాల పరిధిలో టమోటా 200 ఎకరాలు, బొప్పాయి 60 ఎకరాలు, వంకాయ 70 ఎకరాలు, దోస, కర్బూజ 120 ఎకరాలు, డ్రాగన్ ఫ్రూట్స్ 12 ఎకరాలు, అరటి 15 ఎకరాలు, కర్జూరం 10 ఎకరాల్లో ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్నారు. వీటితో పాటు మిరప 20 ఎకరాలు, పొదిన, కొత్తిమీర 10 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటలను సాగు చేయడానికి ఖర్చు ఎక్కువ వస్తున్నదని రైతులు చెబుతున్నారు. బొప్పాయి ఒక ఎకరా సాగు చేసేందుకు అన్ని ఖర్చులకు గానూ రూ.1.70 లక్షలు ఖర్చు అవుతుందని, మిరప ఎకరాకు రూ.70 వేలు, టమోటా ఎకరాకు రూ.లక్ష ఖర్చు అవుతున్నదని రైతులు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టమోటా, బొప్పాయి సాగు చేసుకోవడానికి రైతులకు ఒక ఎకరాకు రూ.30 వేలు, ఇతర పంటలకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్పింక్లర్లు, పోషకాలు వంటివి రైతులకు అందజేసేవారని, పంటల దిగుబడి తగ్గిపోయినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ వంటివి అందించి రైతులను ఆదుకొన్నారని రైతులు అంటున్నారు. కానీ నేడు రైతులు సాగు చేసే పంటలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీలు కానీ, నష్టపరిహారాలు కానీ అందించలేదని చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం మోటార్లు, పైపులు, ఆయిల్ ఇంజన్లు, ఎరువులు వంటి వాటిని కూడా రైతులకు అందించిందని తెలిపారు. గతంలో వరి, వేరుశనగ, కంది, ఉలవ వంటి పంటను సాగు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయామని, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నాము. అయితే ఇటీవల పంట సాగులో కూడా ఖర్చు ఎక్కువ అవుతున్నదని తెలిపారు. గతంలో పోల్చితే ఎరువులు, కూలీల రేట్లు, ట్రాక్టర్ బాడుగలు రెండింతలు పెరిగాయని, కానీ పంటల ధరలు మాత్రం పెరగలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంటను సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తే ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేస్తామని పలువురు రైతులు పేర్కొంటున్నారు.



నూలివీడులో సాగు చేసిన వంకాయ తోట

నూతన పంటలను సాగు చేస్తున్నా..



నేను గత కొంత కాలంగా వరి, వేరుశనగ పంటలను సాగు చేస్తూ ఉండేవాడిని. కానీ ఈ పంటల వల్ల గిట్టుబాటు రాకపోవడంతో వీటి స్థానంలో ఈ ఏడాది 12 ఎకరాల్లో బొప్పాయిని సాగు చేస్తున్నాను. ఒక ఎకరా బొప్పాయి సాగుకు రూ.1.50లక్షల ఖర్చు అవుతున్నది. ఇంకో రెండు నెలలకు కోతకు వస్తుంది. బొప్పాయికి తెగుళ్లు ఎక్కువగా సోకుతాయి కాబట్టి ప్రతిరోజూ పంటను పరిశీలించాలి. ఈ ప్రాంతంలో బొప్పాయి మార్కెట్ సౌకర్యం లేదు. బెంగుళూరు, చెన్నై, ముంబాయి వంటి నగరాల్లో వీటిని ఎగుమతి చేయాల్సి వస్తుంది.

\- గీదర ధర్మారెడ్డి, రైతు, పేరంపల్లె

మార్కెట్ సౌకర్యం కల్పించాలి..



నేను రెండు ఎకరాల్లో వంకాయను సాగు చేశాను. ఒక ఎకరా సాగు చేసేందుకు రూ.లక్ష అవుతున్నది. వంకాయ సాగుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకం లేదు. గత ప్రభుత్వం సబ్సిడీ రూపంలో డ్రిప్, పైపులు అందించేవి. ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి సాయం చేయలేదు. పండించిన వంకాయ చెన్నైకి తీసుకెళ్లేందుకు బాడుగలు ఎక్కువగా అవుతున్నాయి. ఖర్చు ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉంది. కొన్ని సందర్భాల్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో కాయలు తోటల్లోనే వదిలేస్తున్నాం. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

\- మోపూరి రమణయ్య, రైతు, గుండ్లచెరువు

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య



వెంకట్రమణ మృతదేహం

సంబేపల్లె, జనవరి 9: మండల పరిధిలోని సంబేపల్లె గ్రామం కృష్ణబాబునగర్‌కు చెందిన కటారు వెంకట్రమణ (30) సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... వెంకట్రమణ ఇంట్లో ఉరి వేసుకోగా.. గమనించిన కుటుంబ సభ్యులు గుర్తించి 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగించే వాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతిచెందిన రమేష్

సికెదిన్నె, జనవరి 9: పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన చిన్నాయిపల్లె రమేష్ (24) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి వివరాల మేరకు.. రమేష్ తన స్నేహితుడు వెంకటసుబ్బయ్యతో కలిసి బైకులో కడపకు వెళ్లారు. పని ముగించుకుని మంగళవారం రాత్రి ఇంటికి వెళుతుండగా ఎర్రమాచుపల్లె బ్రిడ్జి సమీపంలోకి రాగానే చీకటిలో ఎదురుగా వస్తున్న సైకిల్ కనపడక తగిలించి బైకు అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో రమేష్ తలకు బలమైన గాయాలై స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వెంకటసుబ్బయ్య, మరో వ్యక్తి చికిత్స పొందుతున్నారు. వెంకటసుబ్బయ్య తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



షేక్ అమీర్‌బాష మృతదేహం

ఓబులవారిపల్లె, జనవరి 9: జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని వ్యాన్ ఢీకొనడంతో షేక్ అమీర్‌బాష (65) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి కొర్లకుంట గ్రామానికి చెందిన అమీర్‌బాషా కొర్లకుంట క్రాస్ వద్ద రోడ్డు దాటే క్రమంలో వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి



మృతుడు నరేశ్



నరేశ్ (ఫైల్)

సంబేపల్లె, జనవరి 9: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని మోటకట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో గోటూరి నరేశ్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.... సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం బంకాడపల్లెకు చెందిన నరేశ్ రాయచోటి ఏజీ గార్డెన్‌లో ఉంటున్నాడు. ద్విచక్ర వాహనంలో రాయచోటి నుంచి తన స్వగ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నారాయణ 5 సంవత్సరాల క్రితం ఆరోగ్యంతో మృతి చెందాడు తల్లి దేవి జీవనోపాధి కోసం కువైట్‌లో ఉంటోంది. ప్రమాద విషయం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని బోరుమని విలపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై ఆగి ఉన్న లారీకి ఇండికేటర్స్ వేయకపోవడం, పెట్రోలింగ్ టీం నిర్లక్ష్యం వల్లే ఓ నిండు ప్రాణం బలైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రపంచ పర్యాటక పటంలో గండికోట



గండికోట ఫొటోలను ఆవిష్కరిస్తున్న పర్యాటక సంస్థల ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9: ప్రపంచ పర్యాటక పటంలో గండి కోటకు శాశ్వత స్థానం లభించిదని వక్తలు తెలిపారు. మంగళవారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో గండికోట 901 ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాల పర్యాటక విభాగం బాధ్యులు ఎన్.శివపార్వతి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఇంటాక్ జిల్లా చాప్టరు కన్వీనరు చిన్నపరెడ్డి, గండికోట రాజవంశీకులు పెంబసాని ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం గండికోట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం హర్షణీయమన్నారు. అనంతరం వేంపల్లె డిగ్రీకళాశాల చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు వక్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి: సీఐ


తేజస్విని సన్మానించిన కళాశాల యాజమాన్యం

రైల్వేకోడూరు, జనవరి 9: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీఐ మధుసూదన్‌రెడ్డి ఆశించారు. వెంగమరాజుపోడు వాసులు హస్తి చంద్రరాజు, హస్తి సుప్రజ కుమార్తె తేజస్విని డిసెంబరు 31 నుంచి జనవరి 5 వరకు మధ్యప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినందుకు ఎస్వీ జూనియర్ కళాశాలలో యాజమాన్యం అభినందించారు. క్రీడల్లో రాణిస్తే మంచి అవకాశాలు ఉంటాయని సీఐ అన్నారు. తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే ఆమె క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ఉమ్మడి కడప జిల్లా స్కూలు గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చమర్తి శారద మాట్లాడుతూ తైక్వాండో క్రీడలో పిల్లలకు మంచి తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డైరెక్టర్ ఎస్. వసుంధర మాట్లాడుతూ తేజస్విని తమ కళాశాలలో సీనియర్ ఎంపీసీ చదువుతోందన్నారు. ఆర్ఎస్ అకాడమి కోచ్ హస్తి రవిశంకర్‌రాజు తేజస్వినికి ప్రోత్సాహకంగా రూ. 20 వేలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం తేజస్విని, తల్లిదండ్రులను కళాశాల యజమాన్యం సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

21వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె


ధర్నా నిర్వహిస్తున్న సమగ్ర శిక్షణ ఉద్యోగులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 9: సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్నారు. గత నెల 20వ తేదీ నుంచి చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 21వ రోజుకు చేరింది. శిబిరంలో ఉద్యమవీరుడు వాసుదేవ్ అనకాపల్లి జిల్లా వారు అమరులయ్యారు. వీరి ఆత్మకు శాంతి కలగాలని అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగు లు కోరుతున్నారు. వీరి మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపి సంఘీభావం తెలియజేశారు.

గర్భిణులకు ప్రతి నెలా వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, జనవరి9: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా ప్రతి నెలా 9వ తేదీన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమాల్, డాక్టర్ కార్తీక్, విశ్వనాథ్ అన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు మాట్లాడుతూ 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వారు తప్పక పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకున్నప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసి పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ఏఎన్ఎంలకు భార్య, భర్తల ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్ నెంబరు అందజేసి నమోదు చేయించుకోవాలన్నారు. అప్పుడే ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం ద్వారా వచ్చే రూ.6వేలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఎన్ శైలజ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

27 మంది గర్భిణులకు....

సుండుపల్లె, జనవరి9: రాయవరం వైద్యశాలలో 27 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలియపరిచారు. 108, 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గర్భిణులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రవికుమార్, ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పాల్గొన్న టీడీపీ నేతలు


అన్న క్యాంటీన్‌లో భోజనాలు తింటున్న టీడీపీ నేతలు

రాజంపేట, జనవరి9: గంటా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, టీడీపీ నేతలు గంటా నరహరి ఆధ్వర్యంలో రాజంపేటలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో మంగళవారం మధ్యాహ్నం టీడీపీ నేతలు భోజనం చేశారు. టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు వాణి, ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గంజి సుబ్బరాయుడు, జిల్లా వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి పలుకూరి ఉగ్రవీంద్ర, కొండవీటి సింహ, సంతోష్ పాల్గొన్నారు. అన్నదానంల వారు పేదలతో కలిసి భోజనం చేశారు. సుమారు 600 మందికి రోజూ అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎస్మాను ఎదిరిద్దాం

- డిమాండ్ల కోసం ఉద్యమిద్దాం
- ఎస్మా జీఓ-2ను రద్దు చేయాలంటూ సీఐటీయూ ధర్నా

రైల్వేకోడూరు, జనవరి 9: పిచ్చుకపై బ్రహ్మాస్త్రం వేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మాజీఓ-2ను ఎదిరిద్దామని సీఐటీయూ, అంగన్వాడీల సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొనైనా డిమాండ్లను సాధించుకుందామన్నారు. అంగన్వాడీల ధర్నా 29వ రోజు స్థానిక గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయకుండా, వర్తించని ఎస్మాను ప్రభుత్వం అమలు చేసిందని ఆరోపించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణం ఎస్మాను ఉపసంహరించుకోవాలన్నారు. 2017 నుంచి పెండింగ్ టీఏ, డీఏలు వెంటనే ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తే ఉద్యమాలు తీవ్రరూపం దాల్చుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం. జయరామయ్య, సీపీఎం మండల కార్యదర్శి లింగాల యానాదయ్య, సీఐటీయూ మండల కోశాధికారి కత్రతోటి హరినారాయణ, మండల సహాయ కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, ఏపీఎండీసీ, మైనింగ్ యూనియన్ అధ్యక్షుడు పూలగంటి శ్రీనివాసులు, శంకర్‌రాజు, సురేంద్ర, శ్రీనివాసులురెడ్డి, కేవీపీఎస్, ఏపీ రైతు సంఘం, భవన నిర్మాణ కార్మికుల యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు నాగిపోగు పెంచలయ్య, హరి, శివ, కేశవులు, బొజ్జ శివయ్య పాల్గొన్నారు.

స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు నిర్వహించిన భారీ ర్యాలీ అనంతరం రైల్వేకోడూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీసన వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. వెట్టిచారీ వేయించుకుని వేతనాలు పెంచకుండా ఉన్నారని ఆరోపించారు. సచివా లయ ఉద్యోగులు తమ సమ్మెకు సహకారం అందించాలన్నారు. అంగన్వాడీ నాయకురాళ్లు పద్మ, లీలా, శిరీషా, దుర్గా, రాధ తదితరులు పాల్గొన్నారు.

దోపిడి రాజ్యం.. దొంగల రాజ్యం

చిట్వేలి, జనవరి9: 'ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం.. దోపిడి రాజ్యం దొంగల రాజ్యం' అంటూ నినాదాలతో చిట్వేలి హోరెత్తింది. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన రాస్తారోకోలో సీఐటీయూ కేవీపీఎస్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహం నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కొత్తబస్టాండులో మానవహారం ఏర్పడి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పందికాళ్ల మణి, పెంచలయ్య, సుజాత, సుధామణి, రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఒంటికాలిమీద నిలబడి నిరసనలు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి9: అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై 29వ రోజు నిరసనలు జోరందుకున్నాయి. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ 29 రోజులుగా అంగన్వాడీలు రోడ్లపైన పడి నిరసనలు, ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని వారు విమర్శలకు దిగారు. అంగన్వాడీలను సతాయించిన, ఇబ్బంది పెట్టినా ప్రభుత్వాలు ఏవీ గద్దె కట్టిన పాపాన పోలేదని ఈ ముఖ్యమంత్రి గమనించాలన్నారు. అంగన్వాడీల పరిధిలోనికి రాని జీఓలను విడుదల చేస్తూ జీతాలు పెంచేది లేదంటూ ఖచ్చితంగా విధుల్లోకి చేరాలని షోకాజ్ నోటీసు ఇస్తామని బెదిరింపులకు నిరసనగా రాయచోటిలో మంగళవారం రిలే దీక్షలు 4వ రోజు కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై కిలోమీటర్ పొడవునా ఒంటికాలిమీద నిలబడి ఎస్మాను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసి పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, అంగన్వాడీల జిల్లా కోశాధికారి బంగారుపాప, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, ఖాజాబీ, సిద్దమ్మ, అరుణ, గౌరి, చంద్రకళ, సునంద, రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, కురబలకోట, పెద్దమండెం మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఎస్మా రద్దు చేసి జీతాలు పెంచండి

రాయచోటి(కలెక్టరేట్), జనవరి9: అంగన్వాడీలపై ఎస్మా రద్దు చేసి జీతాలు పెంచాలని, లేనిపక్షంలో ఎన్నికల్లో మహిళలే జగన్‌కు తగిన బుద్ధి చెబుతారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం అన్నమయ్య జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కోకన్వీనర్ సరోజమ్మ తెలిపారు. ఏఐటీయూసీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపిన వారు మాట్లాడుతూ అంగన్వాడీలు కడుపు మండి గౌరవ వేతనం మాకొద్దు కనీస వేతనం అమలు చేయాలని సెంటర్లు, ఇళ్లు వదిలి పసిబిడ్డలను వెంట పెట్టుకుని సమ్మె చేస్తుంటే సీఎం జగన్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సుజాత, సంధ్య, రజిని, మడితాడి సుజాత, లీలావతి, విజయ, ప్రమీల, సుమిత్ర పాల్గొన్నారు.

ఉద్యమాలు ఆగవు

లక్కిరెడ్డిపల్లె, జనవరి9: విధుల్లో చేరాలని ప్రభుత్వం నోటీసులు జారిచేసినా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలు ఆగవని అంగన్ వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో ఆమె మాట్లాడుతూ విధుల్లో చేరాలని బెదిరించేలా నోటీసులు జారీచేసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రభావతి, సీఐటీయూ నేతలు, అంగన్ వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

రాజంపేట టౌన్, జనవరి9: అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రవికుమార్, అంగన్‌వాడీ నాయకులు ఈశ్వరమ్మ, విజయ, శివరంజిని, అమరావతి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు - రాజంపేట అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు - లక్కిరెడ్డిపల్లెలో నిరవధిక సమ్మె....

నమ్మి ఓటేస్తే పంగ నామాలు పెడతారా..?

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

రాయచోటిటౌన్, జనవరి9: 'రెగ్యులర్ చేస్తారని జగన్‌ను నమ్మి మున్సిపల్ కార్మికులు ఓటేస్తే మూడు నామాలు పెడతాడా..?' అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రెగ్యులర్ చేయకుండా జగన్ ప్రభుత్వం పంగనామాలు పెట్టిందన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కార్మికులు మున్సిపల్ ఆఫీస్ నుంచి వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకుని నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మూడు దఫాలుగా చర్చలు జరిపి హెల్త్ అలవెన్స్ జీతంతో కలిపి ఇస్తామని అంగీకరించినా రెగ్యులర్ చేస్తామన్న హామీని విస్మరించడం తగదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు 11వ పీఆర్‌సీలో బేసిక్ అయినా వేతనంగా ఇవ్వాలన్నారు. జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పని భారం తగ్గించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కేవీపీఎస్ జిల్లా కోకన్వీనర్ డీసీ వెంకటయ్య కనీస వేతనాలు ఇచ్చి రెగ్యులర్ చేయకపోతే వారి భవిష్యత్ ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కనీసం ఇప్పుడైనా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని, లేని పక్షంలో వారి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు చెన్నయ్య, రాంబాబు, రమణ, తిరుపాల్, సురేంద్ర, అశోక్, రవి, సురేశ్, మంగమ్మ పాల్గొన్నారు.


రాయచోటిలో చెవిలో పూలు పెట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న పారిశుధ్య కార్మికులు
రాజంపేటలో నోరు మూసుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మాట తప్పిన సీఎం గోవిందా.. గోవిందా...

మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన మాట తప్పి మోసం చేసిన సీఎం జగన్ గోవిందా.. గోవిందా అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చెవులో పూలు పెట్టుకుని గోవిందా.. గోవిందా అంటూ నినాదాలు చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు నాలుగున్నరేళ్లగా మున్సిపల్ కార్మికులు అనేక ఆందోళనలు చేసినా సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చేయడం వల్లే సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించేందుకు సిద్ధపడలే దన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి రమణ, కార్మికులు వెంకటలక్ష్మి, సరోజ, మహేశ్, ప్రవీణ్, మౌనిక, లక్ష్మి దేవి, కృష్ణయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు ఆందోళన

రాజంపేట టౌన్, జనవరి9: తమ సమస్యలు పరిష్కరించాలని రాజంపేటలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరసనలో మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు నినాదాలు చేశారు. నోరు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మిక నేతలు ఓబయ్య, ప్రసాద్, లక్ష్మీదేవి, రవికుమార్ పాల్గొన్నారు.

రాచపల్లెలో క్రికెట్ టోర్నీ

రామాపురం, జనవరి9: రాచపల్లెలో టీడీపీ నేతలు క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గ్రామంలో ముందస్తు సంక్రాంతి పండుగలో భాగంగా యువత క్రీడలపై ఉత్సాహంతో ఉన్నారని, గ్రహించిన రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్ రెడ్డి క్రీడలను ఏర్పాట్లు చేయమని చెప్పినట్లు వారు తెలిపారు. టీడీపీ నేతలు మదన్ మోహన్, శివారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, ఖాసీంపీర, కిరణ్‌నాయుడు, నందకిశోర్ నాయుడు, లక్ష్మిరెడ్డి, రాంమోహన్, దేవేంద్ర పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

సుండుపల్లె, జనవరి9: సంక్రాంతి సంబరాల్లో భాగంగా చిన్నగొల్లపల్లెలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించినట్లు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దినేశ్ తెలిపారు. టోర్నీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. మండల వ్యాప్తంగా 26 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. విజేతకు రూ.30 వేలు, రూ.15 వేలు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందజేస్తారన్నారు. హరివరప్రసాద్, గుగ్గిళ్ల నాగార్జున, వెంకటేశ్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం

ఒంటిమిట్ట, జనవరి9: స్థానిక వీరాంజనేయస్వామి గుడి వద్ద టీడీపీ నేత గంటా నరహరి సతీమణి గంటా చైత్ర పేరు మీద పేదలకు అన్నదానం నిర్వహించారు. పేదలందరికీ నియోజకవర్గ వ్యాప్తంగా అన్నదానం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఆలయాల వద్ద పేదలకు అన్నదానం చేపట్టారు. అన్నదానంలో పెద్ద ఎత్తున యాత్రికులు పాల్గొన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, పసుపులేటి వెంకటరమణ, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, హరికృష్ణ రాజు, శ్రీను, రవిశంకర్, రవికుమార్, చంద్రశేఖర్ రాజు, పోలిశెట్టి మధు, కల్లా యల్లయ్య, వెంకటరమణ, టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

సుండుపల్లె, జనవరి9: టీడీపీ అధికారంలోకి వస్తే మైనార్టీలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప తెలిపారు. గుట్టకింద రాచపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాంమోహన్, టీడీపీ నేతలు అమర్‌నాథరెడ్డి, ఎల్‌వీ రమణ, జనార్ధన్‌నాయుడు, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కొండ్లోపల్లెలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ


బాబు ష్యూరిటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న సుబ్బనరసయ్య నాయుడు

రాజంపేట, జనవరి9: కొండ్లోపల్లెలో మండల పార్టీ టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. రాజంపేట మండల టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్‌రాజు, బూత్ కన్వీనర్ సరిగిరి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ నేతలు మృగరాజు, సుబ్బరాజు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేతల అక్రమ నిర్బంధం


పోలీస్‌స్టేషన్‌లో యూటీఎఫ్ నేతలు

నందలూరు, జనవరి9: మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ఎం.హరినాథ్, కార్యదర్శి కె.రమేష్‌బాబు, ఆర్థిక కార్యదర్శి వీరనాల సుధాకర్‌ను సోమవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించారు. పెండింగ్ బకాయిల సాధన కోసం విజయవాడలో జరగనున్న యూటీఎఫ్ పోరుబాటు 36 గంటల ధర్నాకు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి 41ఏ నోటీసు అందజేసి అదుపులోకి తీసుకున్నారు. రాత్రి 11గంటలకు కానిస్టేబుల్ ద్వారా ఎవరి ఇళ్లకు వారిని పంపించారు. ఉపాధ్యాయ సంఘ నేతలు తీవ్ర ఆవేదన చెందారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పెనగలూరు, జనవరి9: బెస్తపల్లి, పెనగలూరు, కొండూరు, తిమ్మయ్యగారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 8గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని పెనగలూరు ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. లైన్ల కింద చెట్లు కొమ్మలు తొలగించే కార్యక్రమంలో లైన్లలో కలుగుతున్న అంతరాయాలను సరిచేసేందుకు ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. ప్రతి శనివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని శనివారం కరెంటు కోత లేకుండా బుధవారానికి ఉన్నతాధికారులు మార్పు చేశారని తెలిపారు.

సహకార బ్యాంకుల్లో సంబరాలు

గాలివీడు, జనవరి9: కడప జిల్లా సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రూ.3 వేల కోట్లు దాటిన సందర్భంగా అన్ని బ్రాంచుల్లో సంబరాలు చేసుకున్నారు. గాలివీడు బ్రాంచ్ 2012 డిసెంబరులో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు సహకార సంఘాలతో కలిసి రూ.75 కోట్లు ఇచ్చారన్నారు. బాలీవుడ్ బ్రాంచ్‌లో అన్ని రకాల లోన్లు సకాలంలో లబ్ధిదారులకు అందజేస్తామని బ్రాంచ్ ఏజీఎం పీవీ నారాయణరాజు తెలియజేశారు. బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయచోటిటౌన్, జనవరి9: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా నూతన కార్యవర్గాన్ని మదనపల్లిలో జరిగిన జిల్లా కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అంకం శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోకల మధుసూదన్, ఆర్థిక కార్యదర్శిగా అరవ వేణు గోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, ఎన్నికల అధికారిగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి వ్యవహరించారు.

వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


భోగి మంటలు వేసి గొబ్బిళ్లు తడుతున్న విద్యార్థినులు - ముందస్తు సంక్రాంతి పండుగ చేసుకుంటున్న విద్యార్థులు

రాజంపేట టౌన్, జనవరి9: ముత్యాల ముగ్గులు, భోగి మంటలు, గొబ్బిళ్లు, సంప్రదాయ దుస్తులతో రాయలసీమ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొండపల్లి కల్పన, డైరెక్టర్లు కృష్ణచైతన్య, సూర్యచైతన్య ఆధ్వర్యంలో విద్యార్థినులు తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందలూరులో....

నందలూరు, జనవరి9: ముందస్తు సంక్రాంతి వేడుకలను జ్ఞాన దీప్తి పాఠశాల కరస్పాండెంటు అద్దంకి జానకినాథ్, ప్రధానోపాధ్యాయులు లక్షుమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులతో భోగిమంటలను ఏర్పాటు చేసి గొబ్బెమ్మ పాటలు పాడారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు గాలిపటాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రమణ, వినయ్, సురేష్, తులసీరామ్, సాధిక్‌బాష, పద్మ, నాగరత్న, దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటంలో ఘనంగా ముందస్తు సంక్రాంతి

సిద్దవటం, జనవరి9: బ్రాహ్మణవీధిలోని హైస్కూలులో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన హరిదాసు, గొబ్బెమ్మ వృషభాలు, గడ్డితో తయారు చేసిన పూరిపాకలు చూపరులను ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు పోలు వెంకటసుబ్బయ్య పిల్లలకు సంక్రాంతి పండుగ విశిష్టతను తయారు చేసి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌కి అవార్డు


సర్టిఫికెట్ అందుకుంటున్న ఏడీఆర్ రమణ, శాస్త్రవేత్తలు

తిరుపతి(విద్య), జనవరి 9: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిధిలో తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) వరుసగా మూడో ఏడాదీ ఉత్తమ పరిశోధనా స్థానం అవార్డును కైవసం చేసుకుంది. గుంటూరులోని వర్సిటీ కేంద్రంగా మంగళవారం నిర్వహించిన 53వ పరిశోధనా, విస్తరణ సలహామండలి సమావేశంలో వీసీ ప్రొఫెసర్ శారదా జయలక్ష్మి, అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ సలహాదారులు బి.బ్రహ్మానందరెడ్డి చేతులమీదుగా బెస్ట్ రీసెర్చ్ స్టేషన్ సర్టిఫికెట్‌ను ఏడీఆర్ డాక్టర్ సి.రమణ అందుకున్నట్లు ప్రకటించారు. రమణ మాట్లాడుతూ.. మూడో ఏడాదీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యోగుల సమన్వయంతో సాధించామని తెలిపారు. వర్సిటీ అధికారులు, ఈసీ సభ్యులు, ప్రధానశాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ పి.బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ నాగమాధురి, డాక్టర్ టి.ప్రతిమ, డాక్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూకు నైలెట్ కేంద్రం మంజూరు

రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టుకు పచ్చ జెండా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: ఎస్వీ యూనివర్సిటీకి రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టు మంజూరైంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రితోపాటు సంబంధిత ఉన్నతాధికారులతో ఎంపీ గురుమూర్తి సంప్రదించి ఈ కేంద్రం మంజూరుకు కృషి చేశారు. యూనివర్సిటీలో నైలెట్ కేంద్రం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను ఓ కమిటీని అధ్యయనం చేసింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా కేంద్రం పచ్చజెండా ఊపింది. చెన్నైలోని నైలెట్ ఈ ప్రాజెక్టును నిర్వహించేలా కేంద్రం మార్గదర్శకాలను రూపొందించినట్టు తెలుస్తోంది. ఈ కేంద్రం రాకతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే పలు కోర్సులను నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది. పైగా తైవాన్, జపాన్, కొరియా, చైనా వంటి దేశాల్లోని పలు సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుని కోర్సుల నిర్వహణ, ఉపాధి కల్పన అంశాల్లో పరస్పర సహకారంతో తిరుపతి ప్రాంత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. కేంద్రం ఏర్పాటైన మూడేళ్ల నుంచి ఏటా వెయ్యి మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని, వెలుపలకు రానున్నారు. ఈ కేంద్రం మంజూరకు సహకరించిన సీఎం జగన్‌కు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

పంటలపై ఆగని గజదాడులు



ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన కొబ్బరిచెట్లు.. అరటిచెట్లు

కల్లూరు, జనవరి 9: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రెడ్డివారిపల్లి, కమ్మపల్లి పంచాయతీల్లో సోమవారం రాత్రి కొబ్బరి, అరటి, మామిడి, మిరప తదితర పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. నిన్నటి వరకు వ్యవసాయ పొలాల్లో సంచరిస్తూ పంటలను తొక్కేసిన ఏనుగులు సోమవారం రాత్రి రెడ్డివారిపల్లి పంచాయతీ వంకమద్దివారిపల్లిలో హల్‌చల్ చేశాయి. గ్రామం సరిహద్దులోకి చేరుకున్న ఏనుగులు గ్రామం చుట్టూ ఉన్న అరటిచెట్లను విరిచేశాయి. శిద్దారెడ్డికి చెందిన 30.. శ్రీనివాసులురెడ్డికి చెందిన 5 కొబ్బరిచెట్లను విరిచేశాయి. కమ్మపల్లికి చెందిన దామోదర్‌నాయుడు, రెడ్డిశేఖర్‌నాయుడు అరటి, మిరప పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఇటీవల ఏనుగుల దాడులతో పంటలను కోల్పోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాధంనాయుడు డిమాండ్ చేశారు.

విధుల్లోకి సమగ్రశిక్ష ఉద్యోగులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 9: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 20 రోజులుగా సమ్మె చేసిన సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనివార్య కారణాలతో మంగళవారం సమ్మెకు తాత్కాలిక విరామం ప్రకటించారు. ఈ మేరకు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డిని కలిసి తాత్కాలిక విరామం ప్రతిని అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 61,511 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 20,777 మంది తలనీలాలు సమర్పించారు.

యాక్టర్‌గా శిక్షణ పొందుతున్న చరిత్


కుటుంబ సభ్యులతో సుధీర్‌బాబు

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద కుమారుడు చరిత్ మానస్ యాక్టర్‌గా శిక్షణ పొందుతున్నాడని సినీ హీరో సుధీర్ బాబు తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా తన కుమారుడు చరిత్‌ను ఎప్పుడు సినిమాల్లోకి తీసుకొస్తారని అడుగుతున్నారన్నారు. తను రావడానికి ఇంకా రెండుమూడేళ్లు పడుతుందన్నారు. అలాగే సూపర్‌స్టార్ కృష్ణకు ఎంతో ఇష్టమైన తన రెండో అబ్బాయి కూడా ఉన్నాడని, తమ ఫ్యామిలీ నుంచి ఫ్యూచర్ జనరేషన్ సెక్యూర్‌గా ఉందని నవ్వుతూ చెప్పారు. ఏడాదిలో రెండుసార్లు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ, ప్రజలు బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. 'మా నాన్న సూపర్ హీరో', 'హరోం హర' చిత్రాల షూటింగ్ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే విడుదల తేదీలను ప్రకటిస్తామన్నారు.

ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు


బిక్షాల గాలిగోపురం వద్ద పరిశీలిస్తున్న ఈవో రామారావు

శ్రీకాళహస్తి జనవరి 9: ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై మంగళవారం అధికారులు కసరత్తు చేశారు. మాస్టర్ ప్లాన్ డిజైన్ రూపొందించిన ద్రోణా సంస్థ ప్రతినిధులు మంగళవారం శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఈవో రామారావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ద్రోణ ప్రతినిధులతో కలిసి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరగబోయే నిర్మాణాలపై చర్చించారు. ఇందులో భాగంగా తేరువీధి, రాజగోపురం, బిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురం, జలవినాయక కూడలి, సన్నిధి వీధి, టూరిస్టు బస్టాండు, గుడ్డేరు, భరద్వాజ తీర్థం ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. ఆయా చోట్ల మాస్ ప్లాన్ డిజైన్‌లో భాగంగా చేపట్టబోయే నిర్మాణాలపై అధ్యయనం చేశారు. ఈఈ నూక రత్నం, ఏఈ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను అమలు చేసే పార్టీకే మద్దతు

మజ్దూర్ యూనియన్ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 9: పాత పింఛను విధానం అమలు చేసేలా రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు వెల్లడించారు. తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట మంగళవారం యూనియన్ తిరుపతి శాఖ ఏర్పాటు చేసిన రిలేదీక్షలను ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం నూతన పింఛను విధానం రద్దు చేసి.. పాత పింఛను విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పోరాడటానికి దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఏకమై జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం (జేఎఫ్‌ఆర్‌వోపీఎస్)గా ఏర్పడ్డాయని చెప్పారు. ఈ సంఘానికి తమ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్ర కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన పిలుపుతో భారత రైల్వేలో మంగళవారం నుంచి గురువారం వరకు రిలేదీక్షలు, నిరసనలు చేపట్టామన్నారు. నాయకులు డి.నారాయణస్వామి. మునిరత్నం, రవీంద్రనాయక్, గౌస్‌బాషా, మారయ్య, దేవేంద్రనాథ్, శివకుమార్, జగదీష్, రోహిణి, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


తొలగించిన ప్రభుత్వ బోరు - గ్రామానికి చెందిన భూమిని ఆక్రమించుకున్న దృశ్యం

వైసీపీ నాయకుల బరితెగింపు

తుమ్మిందలో ప్రభుత్వ స్థలం కబ్జా ● ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామస్తుల ధర్నా

చిత్తూరు రూరల్, జనవరి 9: చిత్తూరులో రోజు రోజుకు వైసీపీ నాయకులు బరితెగిస్తున్నారు. సెంటు ప్రభుత్వ భూమి కనపడినా కబ్జా చేసేందుకు వెనకాడడం లేదు. చిత్తూరు రూరల్ మండలంలోని ఆది ఆంధ్రవాడకు చెందిన ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కబ్జా చేశారు. ఇప్పటికి ఆ స్థలం మీదుగా వెళ్తున్న మురుగునీటి కాలువను పూడ్చివేసి చదును చేశారు. మంగళవారం ఆ స్థలంలో 50 ఏళ్లుగా నీటిని అందిస్తున్న ప్రభుత్వ చేతి బోరును ఎక్స్‌కవేటర్‌తో పెరికించి ఆక్రమించారు. కాలువ పూడ్చివేయడంతో మురుగునీరు రోడ్డుపై పారుతూ దోమలకు ఆవాసంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నించిన గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ మేరకు మంగళవారం చిత్తూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ భూమి, బోరు ఆక్రమించుకున్న వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

దొంగ ఓట్లు తొలగించరెందుకు?

ఆధార్‌తో అనుసంధానం చేసి గందరగోళానికి తెరదించండి - మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన ఆందోళన



తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలని ఆధారాలతో సహా ఎన్నికల అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితంలేకుండా పోతోందని టీడీపీ, జనసేన నాయకులు మండిపడ్డారు. దొంగ ఓట్లు తొలగింపులో మౌనం దాల్చుతున్న అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన నాయకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితాలో గందరగోళంగా మార్పులు, చేర్పులను చేశారన్నారు. చనిపోయినవారి, నగరం నుంచి వెళ్లిపోయినవారి పేర్లను బీఎల్వోల సమక్షంలో గుర్తించి ఫిర్యాదు చేసినప్పటికీ ఇంకా వారు ఓటర్లుగా కనిపిస్తున్నారన్నారు. వైసీపీ దొంగ ఓట్లను నమ్ముకుని ఎన్నికలకు వెళుతోందని ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుపతిలో జరిగిన కార్పొరేషన్, ఎంపీ ఉప ఎన్నిక, టౌన్ బ్యాంకు ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లు వేశారని, అయితే విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ఓటరు కార్డుకు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి.. గందరగోళానికి తెరదించాలని కోరారు. తుది ముసాయిదా జాబితాలో దొంగ ఓట్లకు అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత డీఆర్వో, ఈఆర్వో, ఏఈఆర్వోలపై ఉందని చెప్పారు. లేకుంటే న్యాయపరంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. సుగుణమ్మ నివాసం నుంచి ర్యాలీగా వచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దొంగ ఓట్లను తొలగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు బీఎల్ సంజయ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, సింగంశెట్టి సుబ్బరామయ్య, సూరా సుధాకర్ రెడ్డి, జయరామ రెడ్డి, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, కంకణాల రజినీకాంత్ నాయుడు, ఆముదాల తులసి, ఇనుగొండ సుబ్రహ్మణ్యం, తిరుమల కేశవులు, మన్నెం శ్రీనివాసులు, ఆనంద్ యాదవ్, హేమంత్ రాయల్, కరాటే చంద్ర, రఘు, ప్రకాష్, దర్మారెడ్డి, విశ్వనాథం, రాజారాం, కేవి రమణ, రేవతి, లత, జనసేన నాయకులు సుభాషిణి, రాజేష్ ఆచారి, చందన, దుర్గ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు - భిక్షమెత్తుతున్న మున్సిపల్ కార్మికులు

ఈ ప్రభుత్వాన్ని నమ్ముకుంటే భిక్షమెత్తాల్సిందే

● చిత్తూరులో భిక్షాటన చేసిన మున్సిపల్ కార్మికులు

చిత్తూరు, జనవరి 9: న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారంతో ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు జగన్ అనేక హామీలు ఇచ్చారని, వచ్చిన తరువాత ఒక్క హామీని నెరవేర్చకపోగా సమ్మె చేస్తున్న కార్మికులపై వైసీపీ ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోందన్నారు. ప్రభుత్వాన్ని నమ్ముకోవడం వల్ల కార్మికులు భిక్షమెత్తుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఈ సమ్మెలో సీపీఐ నాయకులు గోపీనాథ్, దాసరి చంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసు, సుగుణ, సురేష్, రమణి, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన, పారదర్శకతకు పెద్దపీట

ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: సమయ పాలన, పారదర్శకతకు పెద్దపీట వేస్తామని ఎస్వీయూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. పలు సెక్షన్ల ఉన్నతాధికారులతో తన చాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. సమయ పాలన, పారదర్శకత, 24 గంటల్లో ఫైళ్ల క్లియరెన్స్, సంపూర్ణ ఈ-ఫైలింగ్‌పై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వర్సిటీపై వస్తున్న విమర్శలన్నింటినీ తిప్పికొట్టేలా ప్రతి ఉద్యోగీ నిబద్ధత, అంకితభావంతో పని చేయాలని కోరారు. ఉద్యోగుల పనితీరుపై ఆయా సెక్షన్ అధికారులు నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ-ఫైలింగ్ విధానాన్ని అన్ని విభాగాలకు విస్తరించాలని చెప్పారు. ప్రతి ఫైల్‌ను 24 గంటల్లో క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వేగవంతంగా నడిపించడానికి పటిష్ట చర్యలు తీసుకోక తప్పదని అభిప్రాయపడ్డారు. దీనికి డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు దోహదం చేయాలని కోరారు. రిజిస్ట్రార్ హుస్సేన్, పరీక్షల విభాగం అధికారి దామ్లానాయక్, డీఆర్‌లు, ఏఏవోలు పుష్పలత, లోకనాథం, చంద్రశేఖర్‌నాయక్, లక్ష్మీనారాయణ, సురేషబాబు, శ్రీనివాసరాజు, చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

21 కేజీల గంజాయి పట్టివేత

నలుగురు బెంగళూరు యువకుల అరెస్టు


గంజాయి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సెబ్ డీఎస్పీ రమేష్

నాయుడుపేట టౌన్, జనవరి 9 : అక్రమంగా తరలిస్తున్న 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ డీఎస్పీ రమేష్ తెలిపారు. నాయుడుపేట సెబ్ కార్యాలయంలో మంగళవారం పట్టుబడ్డ నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. సెబ్ సీఐ ప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కన్పించడంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి బ్యాగుల్లో 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బెంగళూరుకు చెందిన కిరణ్, విక్రమ్, గౌడ్‌పాటిల్, శ్యామ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ 3.15 లక్షలు ఉంటుందని తెలిపారు.

ఖజానా స్ట్రాంగ్‌రూముల్లోని వ్యర్థాలు తొలగించండి : జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 9: జిల్లా ఖజానా, ఉపఖజానా కార్యాలయాల్లో ఏళ్ల తరబడి నిల్వవుంచిన అనవసరమైన వాటిని వెనక్కి తీసుకోవాలని పలు శాఖల జిల్లా అధికారులను జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జేసీ మీటింగ్ హాలులో వివిధశాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఖజానా స్ట్రాంగ్‌రూమ్‌ల్లో విద్యాశాఖకు సంబంధించి వివిధ పరీక్షలకు వాడని ఆన్సర్ షీట్లు, ప్రశ్నపత్రాలు, జిల్లా పరిషత్తు, జిల్లా పంచాయతీ కార్యాలయాలకు సంబంధించి ఎన్నికల నామినేషన్ ఫారాలు, కవర్లు, చెక్‌బుక్కులు, కోర్టులకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా నిల్వవున్న జుడీషియల్, నాన్ జుడీషియల్ స్టాంపులు, కోర్టు ఫీ, నోటరీ, న్యాయవాదుల సంక్షేమ పత్రాలు, హుండీ పత్రాలు, ఇతరత్రా కార్యాలయాలకు సంబంధించి పత్రాలను వెంటనే అక్కడినుంచి తొలగించాలని చెప్పారు. ఇందుకు సంబంధించి జేసీ అధ్యక్షతన ఏడు మంది అధికారులతో కూడిన జిల్లాస్థాయి కమిటీని రాష్ట్ర ఆర్థికశాఖ ఏర్పాటు చేసిందని తెలిపారు. వెనక్కి తీసుకునేవి, తొలగించవలసినవి, తిరిగి అక్కడే భద్రపరచాల్సినవి అని మూడు విభాగాలుగా స్ట్రాంగ్‌రూమ్‌ల్లో నిల్వవున్న వస్తువులను విభజించి, వివరాలు అందజేయాలని చెప్పారు. న్యాయపరంగా సమస్యలు లేని ఫైళ్లను కూడా అక్కడి నుంచి తొలగించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, కమిటీ కన్వీనర్, జిల్లా ఖజానా డీడీ రామచంద్ర, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, డీఈవో విజయేంద్రరావుతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వామి ముద్దు.. జ్ఞానేంద్ర వద్దు

పెనుమూరులో డిప్యూటీ సీఎం అనుకూలవర్గం కొత్త నినాదం


నారాయణస్వామికి మద్దతుగా ప్లకార్డులు చూపుతున్న వైసీపీ నేతలు

పెనుమూరు, జనవరి 9: 'జ్ఞానేంద్రరెడ్డి వద్దు..నారాయణస్వామి ముద్దు' అంటూ పెనుమూరు మండలం పులిగుండు ఏపీ టూరిజం ప్రాంగణంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుకూల వర్గం మంగళవారం డిమాండ్ చేసింది. పెనుమూరు మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సారధ్యంలో జరిగిన ఈ సమావేశంలో జ్ఞానేంద్రరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మండలంలో జ్ఞానేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు 300 ఎకరాలు భూ కబ్జా చేశారని వాటికి అడ్డుపడినందుకే నారాయణ స్వామిపై అసత్యప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్లకార్డులు పట్టుకుని జ్ఞానేంద్రరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఆరు మండలాల వైసీపీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు పద్మనాభరెడ్డి, బండి హేమసుందర్‌రెడ్డి, తులసియాదవ్, తలాబాలజి, దనంజయవర్మ, సుకుమార్, జయచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మునిరాజారెడ్డి, మణి, కుప్పయ్య, గురవారెడ్డి, బాబు, శేఖర్‌యాదవ్, అన్బు, యతీశ్వర్‌నాయుడు, లక్ష్మీపతి పాల్గొన్నారు. ఈ సమావేశంతో నియోజకవర్గంలో వైసీపీలో వర్గ విభేదాలు మరింత ముదురుతున్నట్టు అర్థం అవుతోంది.

మద్యం మత్తులో యువకుల వీరంగం


చికిత్స పొందుతున్న మునిశేఖర్

శ్రీకాళహస్తి జనవరి 9: మద్యం మత్తులో పలువురు యువకులు వీరంగం సృష్టించిన ఘటన మంగళవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద చోటుచేసుకుంది. ఓ స్నేహితుని కార్యం కోసం పట్టణానికి చెందిన కొందరు యువకులు ఎన్టీఆర్ నగర్ వద్ద కలుసుకున్నారు. మద్యం మత్తులో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని పలువురు ఘర్షణకు దిగారు.. శ్రీకాళహస్తి పట్టణం మరాఠి పాలునికి చెందిన మునిశేఖర్ పంక్చర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ఇందులో మునిశేఖర్ ముఖంపై మద్యం సీసాతో దాడి జరిగిందని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరాడు. భారీగా యువకులు ఆసుపత్రి వద్ద గుమిగూడారు. ఉద్రిక్త పరిస్థితులు ఎదురవకుండా పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని అదుపు చేశారు.

అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం

● అంగన్‌వాడీలకు నల్లారి కిశోర్ హామీ

వాల్మీకిపురం, జనవరి 9: రాష్ట్రంలో ఉద్యోగులు మొదలుకుని నిరుపేద ప్రజల దాకా సమస్యలతో రోడ్డున పడుతుంటే పరిష్కరించాల్సిన సీఎం జగన్‌కు రంగులు, బొమ్మల పిచ్చి పట్టుకుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు గత 28 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. అంగన్వాడీల సమస్యలు తనకు పూర్తిగా తెలుసునని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించక పోగా దాడులు, దౌర్జన్యాలతో అరాచకంగా వ్యవహరిస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ రాష్ట్రానికి దరిద్రం పట్టుకుందన్నారు. ఈనెల 24న పీలేరులో పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అంగన్వాడీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్తానని, అంగన్వాడీ మహిళలను ఆయనతో మాట్లాడించి టీడీపీ అధికారంలోకి వచ్చిన తక్షణం పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన తండ్రి నల్లారి అమరనాథరెడ్డి కాలం నుంచి కూడా ఏనాడూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసే రాజకీయాలు చేయలేదని, ఇక్కడున్న వైసీపీ నీతిలేని నేతలకు ఇప్పటికైనా బుద్ధి వస్తే బాగుంటుందన్నారు. వాల్మీకిపురంలో ఎమ్మెల్యే ఇంటి ముందు కూడా రోడ్డు వేయించుకోలేక పోతే గతంలో తామే వేయించామని గుర్తు చేశారు. అంగన్వాడీలు అధైర్యపడొద్దని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ ఎంపీపీలు సురేంద్రవర్మ, వెంకటరమణ, మైనార్టీ నాయకులు సయ్యద్ అమీర్, కువైట్ సయ్యద్‌బాషా, బషీర్, సైదు, జావీద్, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూమైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, దేవసేన, లక్ష్మీప్రసన్న, రెడ్డిరాణి, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మదనపల్లె: రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు

ఎస్మాను రద్దు చేయకుంటే ఉద్యమం

మదనపల్లె టౌన్: అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద అంగన్వాడీలతో కలసి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్మిక సంఘాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే వైసీపీ ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి హరీంద్రనాథ్‌శర్మ, ప్రభాకర్‌రెడ్డి, నారాయణ, అంగన్వాడీ నాయకురాళ్లు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, అనసూయమ్మ పాల్గొన్నారు.



బి.కొత్తకోట: జీవో ప్రతులను దహనం చేస్తున్న నేతలు



తంబళ్లపల్లెలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ దీక్షలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ ఎంఎస్. చంద్రశేఖర్‌రెడ్డి, తంబళ్లపల్లె సీపీఐ ఏరియా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఎస్. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చిరుద్యోగులైన అంగన్వాడీలపై జగన్‌రెడ్డి ప్రభుత్వం జీవో నంబర్ 2 తీసుకొచ్చి బెదిరించడం సమంజసం కాదన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 2 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, లీడర్లు శ్రీవాణి, చాంద్‌బీ, ఈశ్వరి, కుమారి పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: అంగన్వాడీలు, సహాయకురాళ్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి రిలే నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తెచ్చినా అంగన్వాడీ కేంద్రాలు తెరిచేది లేదన్నారు.

పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీలు, హెల్పర్లు జిల్లా కేంద్రం రాయచోటిలో చేపట్టిన నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉమాదేవి, కరుణశ్రీ, సరస్వ తమ్మ, శివమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరకపోతే ఇబ్బందులు పడతారు

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల హెచ్చరిక

బి.కొత్తకోట జనవరి 9: ధర్నాలు ఇక చాలు.. పై నుంచి ఆదేశాలు కఠినంగా ఉన్నాయి. ఈ రోజే గ్రామాలకు వెళ్లి విధుల్లో చేరండి.. అంటూ బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీటీఎం, ములకలచెరువు, బి.కొత్తకోట మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు సూపర్‌వైజర్లు జయరాణి, నాగరత్న హెచ్చరించారు. ధర్నాను విరమించి అంగన్వాడీ సెంటర్లను తెరవక పోతే నోటీసులు ఇస్తామని, తీసుకోక పోతే పోస్టు ద్వారా పంపిస్తామని హెచ్చరించారు. దీనిపై ధర్నాలో పాల్గొంటున్న అంగన్వాడీ వర్కర్లతో పాటు, యూనియన్ లీడర్లు స్పందిస్తూ తమకూ రాష్ట్ర స్థాయిలో యూనియన్లు ఉన్నాయని, వారి ఆదేశాల మేరకే తాము నడుచుకుంటామని, ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు ధర్నా కొనసాగిస్తామని బదులిచ్చారు.

ఈ నోటీసులు, చర్యల విషయంపై ఏం జరుగుతుందో బుధవారం తేలనుంది.

టీడీపీ బలోపేతంపై లోకేశ్ దిశానిర్దేశం

ములకలచెరువు, జనవరి 9: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డికి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ గంటకుపైగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. తంబళ్లపల్లె నియోకవర్గంలో టీడీపీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల పై నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. అన్ని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలు, మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని ఆదేశించారు. జయచంద్రారెడ్డితో పాటు ఆయన బావ మంత్రి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు.



యువనేత నారాలోకేష్‌తో టీడీపీ నేత జయచంద్రారెడ్డి

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయండి

మదనపల్లె, జనవరి 9: మదనపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత మంగళవారం ఆయనను మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, స్థానిక రాజకీయ అంశాలపై చర్చించారు. జనసేన-టీడీపీ సంయుక్త ప్రభుత్వమే ధ్యేయంగా పని చేయాలని, టికెట్ ఎవరికి ఇచ్చినా..అందరూ కలసి మెలసి పనిచేయాలని సూచించినట్లు వారు వివరించారు. గ్రామ స్థాయిలో జనసైనికులు, పార్టీ అభిమానులతో కలసి ముందుకెళ్లాలని సూచించారు. టికెట్ కేటాయింపు అంశంలో నియోజకవర్గానికి, తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. వీరితోపాటు పార్టీ సీనియర్ నాయకులు దారం హరిప్రసాద్, శ్రీరామ హరిహరన్‌లు ఉన్నారు.



పవన్‌కళ్యాణ్‌తో శ్రీరాము రామాంజనేయులు

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించొద్దు

మదనపల్లె టౌన్, జనవరి 9: సంక్రాతి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తరగతులు నిర్వహిస్తున్న పలు ప్రైవేటు పాఠశాలలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించినా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు సెలవులు ఇస్తే ప్రైవేటు సంస్థలు వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులుచర్యలు తీసుకోకపోతే తామే ప్రత్యక్ష చర్యలకు దిగాల్సి వస్తుందని ఏబీవీపీ రాష్ట్ర పాఠశాలల కన్వీనర్ సాయిహితేష్ హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఏబీవీపీ నాయకులు రాజు, అభియన్ శ్రీకాంత్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యూటీఎఫ్ నాయకులు

పీలేరు, జనవరి 9: యూటీఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన 36 గంటల దీక్షకు వెళ్లకుండా పీలేరుకు చెందిన యూటీఎఫ్ నాయకులు సదాశివరెడ్డి, అక్రమ్ బాషా, శివారెడ్డిని పీలేరు పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. విజయవాడలో మంగళవారం 36 గంటల దీక్షకు వెళ్లకుండా ఎక్కడిక్కడ ఉపాధ్యాయ సంఘ నేతలను నిర్బంధించిన పోలీసులు పీలేరులోనూ నాయకులను అదుపులోకి తీసుకుని. మంగళవారం ఉదయం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయిలు అడిగినందుకు తమను నిర్బంధించడం అమానుషమని వాపోయారు.

బకాయిలు అడిగేతే నిర్బంధం.. అరెస్టులా..

మదనపల్లె అర్బన్, జనవరి 9: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 18 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో విజయవాడలో పోరాటాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులను, ఉద్యోగులను నిర్బంధించడం అమానుషమని అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి పురం వెంకటరమణ ఖండించారు. అప్రజాస్వామిక చర్యలకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. నాయకులు సుధాకర్, భానుమూర్తి, హరికృష్ణ, సీనప్ప, హసన్‌బాషా, రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రథమ ముస్లిం ఉపాధ్యాయురాలికి నివాళి

పీలేరు, జనవరి 9: దేశంలోనే ప్రథమ ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలైన కరీమా షేక్ 193వ జయంతిని పీలేరులోని ప్రజా సంఘాలు మంగళవారం ఘనంగా నిర్వహించాయి. బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందజేశారు. మాలమహానాడు కార్యాలయంలో నాయకులు ఆమె చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బలరాం, నాయకులు సయ్యద్ అలీబేగ్, ఎన్టీఆర్ నఫీస్, రవి, రామచంద్ర, శివ, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీకుమార్, సుభాష్, జెట్టి మల్లికార్జున, గట్టప్ప, ఆనంద్, లోకనాథం, భారతీయ అంబేడ్కర్ సేవా సంఘం నాయకులు చీకటిపల్లె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

బి.కొత్తకోట జనవరి 9: ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సలీంబాషా డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ పట్టణ అధ్యక్షుడు కె. బాలకృష్ణ అధ్యక్షతన కార్పెంటర్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎన్నో ఏళ్ల పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును రద్దు చేసి, రూ. 12 వందల కోట్లు ఇతర అవసరాలకు మళ్లించడం అన్యాయమన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లైయింలను వెంటనే విడుదల చేయాలని, 1996 చట్టాన్ని గౌరవించి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు కార్మిక సంక్షేమ బోర్డును భవన నిర్మాణ కార్మికుల కొరకు మాత్రమే వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా జీవో నెంబర్ 17 తీసుకొచ్చి సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి నిధులను పక్క దారి పట్టించిందని ఆరోపించారు. గృహ నిర్మాణ పనులు జరగక ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలు ఆకాశాన్ని అంటడం వల్ల గృహనిర్మాణ పనులు లేక కార్మికులు రోడ్డున పడ్డారని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ల తెరచి కార్మికులను ఆదుకోకపోతే, ప్రభుత్వం మెడలు వంచి సంక్షేమ బోర్డును కాపాడుకుంటామన్నారు. కార్పెంటర్ యూనియన్ నాయకులు గఫూర్, రమేష్, శ్రీనివాసులు, బావాజాన్, ప్రసాద్, ఖామూషా, మస్తాన్‌ఖాన్, కుమార్ పాల్గొన్నారు.

సరైన యాజమాన్యంతో అధిక ఆదాయం

కలకడ, జనవరి 9:గొర్రెలు, కోళ్ల పెంపకంలో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్ని పాపిరెడ్డిగారిపల్లె పశువైద్యాధికారి తేజకల్యాణ్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో పాడి రైతులకు పశువిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలతో చేకూరే లబ్ధిని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకొనే విధానాన్ని తెలియజేశారు. అలాగే 150 పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో సిబ్బంది రెడ్డిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

సామాజిక సమతా సంకల్పం విజయవంతం చేద్దాం

మదనపల్లె టౌన్, జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న అమరావతిలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణకు ముందు నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో భానుప్రసాద్ కోరారు. మంగళవారం మండలంలోని పలు పంచాయతీల్లో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నేటి నుంచి మూడు రోజుల పాటు 24 గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఐదుగురు చొప్పున అమరావతిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ బోధనలు

మదనపల్లె టౌన్, జనవరి 9: మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ బోధన అందిస్తున్నట్లు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం తంబళ్లపల్లె,గుర్రంకొండ, కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లి బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, వసతులను వివరించారు. 2024 విద్యాసంవత్సరంలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

మదనపల్లె- బికొత్తకోట మార్గంలో ఆర్టీసీ గిఫ్ట్‌స్కీం

మదనపల్లె అర్బన్, జనవరి 9: మదనపల్లె- బికొత్తకోట మార్గంలో వన్ డిపో ఆధ్వర్యంలో గిఫ్ట్ స్కీంలు నిర్వహిస్తున్నట్లు ఆ డిపో మేనేజర్ మూడే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులు తాము తీసుకున్న టికెట్ వెనుక పేరు, గ్రామం, ఫోన్‌నెంబరు వివరాలు రాసి బస్సులోని బాక్స్‌లో వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 31న ఆర్టీసీ బస్టాండ్‌లో లక్కీడిప్ తీసి విజేతలకు బహుమతులు అందిస్తున్నట్లు డీఎం తెలిపారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు మదనపల్లె విద్యార్థినులు



జాతీయ జట్టుకు ఎంపికైన మోక్షిత, రజియాతో ఉపాధ్యాయులు

మదనపల్లె టౌన్, జనవరి 9: తమిళ నాడులో నిర్వహించే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు మదనపల్లె విద్యార్థులు ఎంపికయ్యారు. గత డిసెంబర్ 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో మదనపల్లెకు చెందిన మోక్షిత, రజియా అంజూ ఉత్తమ ప్రతిభ కనపరచగా సెలెక్టరు వీరిద్దరిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. వీరు కోయంబత్తూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని శ్రీవేద హైస్కూల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ లక్ష్మినారయణ, ప్రిన్సిపాల్ ఉపేంద్ర అభినందించారు.

నెట్‌వర్క్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ తనిఖీలు



రోగులతో మాట్లాడుతున్న డా.లోకవర్ధన్

పీలేరు, జనవరి 9: పీలేరు పట్టణంలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఒకటైన రిషి ఆర్థో ఆసుపత్రిని మంగళవారం డా.వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డా.లోకవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రిలో సేవలు అందుతున్నాయా అంటూ రోగులను ఆరా తీశారు. శస్త్ర చికిత్స అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్యశ్రీ ఆసరా నిధులు జమ అవుతున్నాయా అని ప్రశ్నించారు. ఆసుపత్రిలోని వైద్య సేవల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యాజమాన్యంతో మాట్లాడుతూ ఆసుపత్రిలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండాలని, నర్సింగ్ సిబ్బందిని తగినంతగా నియమించుకోవాలని సూచించారు.

నాటు సారా స్వాధీనం - మహిళ అరెస్టు

ములకలచెరువు, జనవరి 9: ములకలచెరువు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో మంగళవారం దాడులు నిర్వహించి నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు మహిళను అరెస్టు చేసినట్లు సీఐ మల్లిక తెలిపారు. ఎన్‌వోపీ తాండా సమీపంలో జరిగిన దాడుల్లో 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని నిందితురాలు జేనేమ్మ(49)ని అరెస్టు చేసినట్లు చెప్పారు. రామానాయక్ తాండా సమీపాల్లో దాడులు నిర్వహించి 800 లీటర్ల నాటు సారా ఊటను ధంసం ధ్వంసం చేసినట్లు వివరించారు.

నాటు సారా విక్రేత అరెస్ట్

తంబళ్లపల్లె, జనవరి 9: నాటు సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..నాటు సారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం సాయంత్రం సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి కుక్కరాజుపల్లె క్రాస్ వద్ద ఎగువ సుగాలి తాండాకు చెందిన ప్రమీల నుంచి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

మదనపల్లెలో 'ఇంటింటికీ కాంగ్రెస్'



ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో సింగం రామకృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, జనవరి 9: ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సింగం రామకృష్ణారెడ్డి మంగళవారం ఇసుకనూతన ఎల్లెలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిమంత్రి చేయడమే ధ్యేయంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జేపీడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ ఈశ్వర్, మహిళా నేత శ్రీదేవి, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, సైదా కిసానీ పాల్గొన్నారు.

'మహాశక్తి'తో మహిళలే.. మహారాణులు

పీలేరు, జనవరి 9: ముఖ్యమంత్రి జగన్ చేతుల్లో మోసపోయిన రాష్ట్ర మహిళందరినీ తిరిగి మహారాణులుగా తీర్చిదిద్దేందుకే చంద్రబాబు నాయుడు 'మహాశక్తి' పథకం తెచ్చారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణం కటుకాలువ వీధి, గోరీలతోపు, శ్రీనాథపురం ప్రాంతాల్లో మంగళవారం ఆయన జనసేన నాయకులతో కలిసి "బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ" కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహి ళల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలను వివరించారు.

ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు మహిళలకు అనేక హామీలిచ్చిన జగన్, అధికారంలోకి వచ్చాక మహిళలను దారుణంగా మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కరపత్రాల ద్వారా ఆయా పథకాలను మహిళలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కురవపల్లెలో టమోట పంట నష్టాలపై కిశోర్‌కుమార్ రెడ్డికి వివరిస్తున్న రైతులు



కలకడ: మైనారిటీ సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

కలికిరి: మండలంలోని పారపట్ల పంచాయతీలోని కురవపల్లె, బాలాజీ కాలనీ, పారపట్ల గ్రామాల్లో టమోటా రైతులు తమ సమస్యలను నల్లారి ముందు ఏకరువుపెట్టారు. కనీస మద్దతు ధర లభించడం లేదని, రూ.3 వేల కోట్లతో వ్యవసాయ నిధి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ మోసం చేశాడని విమర్శించారు. సూక్ష్మ సేద్య పరికరాలు, వ్యవసాయ యంత్రాలు, పెట్టుబడి సహాయాలు, పండ్ల తోటలకు ఆర్థిక చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారాలులాంటి టీడీపీ పథకాలన్నీ జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, సర్పంచులు ప్రతాప్‌కుమార్ రెడ్డి, రెడ్డిరాము, యల్లయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కలకడ: స్థానిక ఇందిరమ్మ కాలనీలో మంగళవారం కలకడ మండల మైనారిటీ నాయకులు ఇంటింట కరపత్రాలను అందజేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనారిటీ కార్పొరేషన్ రుణాలు, రంజాన్ తోఫాతోపాటు పలు పథకాల ద్వారా లబ్ధిపొందిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జిలానీ, నౌషాద్, ముబారక్‌అలీ, ఇర్ఫాన్, ఖాజా, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తంబళ్ళపల్లెలో టీడీపీ జెండా ఎగురవేద్దాం..

● మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ పిలుపు

కురబలకోట, జనవరి 9: సమష్టి కృషితో తంబళ్లపల్లెలో టీడీపీ జెండా ఎగురవేద్దామని మాజీ ఎమ్మెల్యే శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అంగళ్లలో రాజంపేట పార్ల మెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, గుండాయిజం పెరిగిపోవడంతో పేదలు, సామాన్యులు స్వేచ్ఛగా బతకలేకపోతున్నా రన్నారు. బటన్ నొక్కుడుతో పేదలకు ఒరిగింది శూన్యమని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా కృషి చేయాలని, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు గురవారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, శ్రీనివాసులు, రమణ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి

పెద్దమండ్యం: వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన పార్టీల గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ పిలుపునిచ్చారు. పెద్దమండ్యంలో మంగళవారం టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు కోరారు. నియోజకవర్గంలోని సమన్వయ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యక్రమాలకు పూర్తి సమయం కేటాయించాలన్నారు. టీడీపీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. జనసేనతో కలసి భూ ఆక్రమణలు నివారిస్తామన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ బీసీ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బుక్కే మనోహర్‌నాయక్, రాజంపేట టీడీపీ ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, టీడీపీ ఎస్టీ సెల్ నాయకుడు నటరాజ్ నాయక్, తంబళ్లపల్లి నియోజక వర్గం టీడీపీ అబ్జర్వర్ గురవారెడ్డి, నియోజక వర్గ జనసేన నాయకుడు సాయినాథ, నియోజక వర్గ మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దమండ్యంలో సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌యాదవ్

ఎన్నికల్లో పోటీకి వీసీకే అభ్యర్థులు సిద్ధం

మదనపల్లె, జనవరి 9: వచ్చే సాధారణ ఎన్నికల్లో ఏపీలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలలో పోటీ చేసేందుకు వీసీకే పార్టీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని, పేద, మధ్యతరగతి వర్గాల భవిష్యత్తుకోసం ప్రజలు వీసీకే అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాగపట్నం ఎమ్మెల్యే మహమ్మద్ షాన్‌వాజ్, తిరుపోరూరు ఎమ్మెల్యే ఎస్.ఎస్.బాలాజీ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీ హాలులో వీసీకే పార్టీ ఎన్నికల సన్నాహక సదస్సు నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు తమిళనాడు, కర్ణాటక, ఏపీకి చెందిన వీసీకే పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కుబేరుల దోసిళ్లకు పోసి, పేద, మధ్యతరగతి ప్రజల భవిష్యత్తును కాలరాస్తుంటే, ఏపీలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బీజేపీతో అంటకాగడం దుర్మార్గమన్నారు. పార్టీ అధిష్ఠానంతో చర్చించి త్వరలోనే అభ్యర్థులను ప్రకటించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి బాలసింగం, ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గణపతి, ముత్యాల మోహన్, టి.ఎ.పీరుబాషా, డాక్టర్ ఎం.ప్రభు, పాలకుంట శ్రీనివాసులు, బాలకృష్ణ, రెడ్డిప్రసాద్, మహేష్, కళ్యాణ్, బాస్ నాయకులు కె.వి.రమణ, పల్లం తాతయ్య, ఇర్ల రమణ, వీసీకే తమిళనాడు రాష్ట్రనేతలు నీలవనత్తునెలవన్, దళపతి సుందర్, కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలి

కలికిరి: గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం జగన్ తెలుగు ప్రజలకు తీవ్ర నష్టం కలిగించాలని, ఇప్పుడైనా వడ్డీతో సహా పరిహారం చెల్లించి ఎన్నికలకు వెళ్ళాలని 'బాస్' సంఘం, వీసీకే పార్టీ నాయకులు డిమాండు చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జగన్‌రెడ్డి ఇచ్చిన హామీల జాబితాను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు భారతీయ అంబేడ్కర్ సేన (బాస్), వీసీకే పార్టీలకు చెందిన కృష్ణయ్య, గురునాథ, చౌడప్ప, హరినాథ, మల్లికార్జున, గురవయ్య, సిద్దయ్య, నరసింహులు, గంగాధర్, పెద్దనరసింహులు తదితరులు పాల్గొన్నారు.



తమిళనాడు ఎమ్మెల్యేలతో కలసి ప్రసంగిస్తున్న పీటీఎం శివప్రసాద్

ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలి: ఆర్డీవో

మదనపల్లె టౌన్, జనవరి 9: ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని ఆర్డీవో మురళి సూచించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటు నమోదు, తొలగించడం ప్రక్రియలో సరైన ఆధారాలు ఉండాలన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడితో అక్రమాలు చేస్తే క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. రాజకీయ నాయకులు కూడా బీఎల్‌వోలతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లను పంపి ఓటరు జాబితా సర్వేను సరిచూసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

సంక్రాతి పండుగ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆర్డీవో మురళి అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ప్రైవేటు విద్యాసంస్థలు, పుర ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పాశ్చాత్య ధోరణిలో పడి నేటి యువత సంక్రాంతి పండుగను మరచిపోకుండా, ఉత్సవాలను నిర్వహిద్దామన్నారు. శుక్రవారం మదనపల్లె జడ్పీ హైస్కూల్ మైదానంలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 6గంటల వరకు ఈ ఉత్సవాలను నిర్వహిద్దామని, దీనికి ప్రతి ఒక్కరి సహాయ, సహకారాలు అందించాలని ఆర్డీవో కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళి